# మార్పు

విజయలక్ష్మి మూర్తి

ఈ నా వార్డ్‌లో సీరియస్ కేస్‌లనీ ఆ తరువాతే రొటీన్ వర్క్‌నీ ఓసారి చూసుకుని రూమ్‌లో కూర్చున్నాను.

ఆ టయిమ్‌కి కాఫీ తాగే అలవాటు, కానీ కేంటీన్ కెళ్ళ బుద్ది కాలేదు.

మిగతా ఇన్‌వెస్టిగేషన్సు చేసే ముందు నాకు తీరిక దొరికిన ఆ కాస్సేపూ అలా కూర్చున్న నేను నా వార్డ్ వైపు తలతిప్పాను.

ఎనిమిదో నెంబరు బెడ్ దగ్గిర నా చూపులు ఆగిపోయాయ్.

మాకు పేషంట్లు వస్తుంటారు. వెడుతుంటారు. నిజానికి డాక్టర్లు పేషంట్లని ట్రీట్ చెయ్యడం వరకే పెట్టుకుంటే సుఖపడతారు. కానీ ఆ రోగుల బాధల్ని సమంగా పంచుకో ప్రయత్నించాడో మనశ్శాంతి అనేదివుండదు.

కానీ నా విషయంలో అప్పుడప్పుడు నా మనసు డాక్టరుకుండవలసిన గట్టి తనం, నిబ్బరం అనే వాటి నుంచి దాటి గంతు వేసేస్తూ వుంటుంది.

నేను న్యూరో సర్జన్ని కాబట్టి నా దగ్గరకి వచ్చే కేసులు తలకాయలకి, మెదడుకి సంబంధించినవి. నిజానికి మామూలు తలనొప్పులు, నడుం నొప్పులు, సింపుల్ హెడ్ ఇంజరీస్‌లో అంత రిస్క్ వుండదు. ఎటొచ్చీ ఈ తలకాయల్లో గడ్డలు అంటే ట్యూమర్ కేస్‌లతోనే గొడవ. వీటిల్లో అప్పుడోటీ అప్పుడోటీ నా మనసుని అదుపులోంచి తప్పించేటటువంటివి వుంటాయి. మామూలు ట్యూమర్ అయితే ఆపరేషన్ చేశాక పేషంటు చక్కగా నడుచుకుంటూ నవ్వుకుంటూ వెడితే నాకూ తృప్తి.

కానీ ఆ ట్యూమర్ కాస్తా కేన్సర్ అయికూర్చుంటే, బాధతో, జాలితో కూడిన ఫీలింగ్స్‌కి అతీతంగా వుండడం కష్టం.

ఆ ఎనిమిదో నెంబరు బెడ్ మీద కల రామారావు చేరి వారం రోజులయింది. అతని పక్కనే వున్న అతని భార్య అతని నోటికి ఏదో పండు అందిస్తోంది.

ముచ్చటైన జంట.

వారం రోజుల క్రితం రామారావు బ్రెయిన్ ట్యూమర్‌ని ఆపరేట్ చేశాను.

అంతక్రితమే ఎమర్జెన్సీ కాల్ వస్తే అర్ధరాత్రి పరిగెత్తుకుంటూ వచ్చాను.

ఎప్పుడూ లేనిది పెద్ద ఫిట్ వచ్చి పడిపోయాడట అతను. పెళ్ళయి సరిగ్గా వారం రోజులు అయిందనీ వెనగ్గా నిల్చున్న ఆ అమ్మాయి సీత అతని భార్య అనీ అన్నారు.

బేలగా నిల్చుంది ఆమె. వారం రోజులు పాతబడినా, మెళ్ళో పసుపుతాడుతో, కాళ్ళకు పారాణితో ఇంకా పెళ్లి పీటల మీది నించి లేచి వచ్చినట్లే వుంది ఆ అమ్మాయి. చూడటానికి పదిహేడు పద్దెనిమిదేళ్ళ కంటే వయసు లేదనిపించింది. ఇంకా పసితనపు ఛాయలు పోలేదన్నట్లు అమాయకంగా వున్న ఆమె కళ్ళు, పాలు గారుతున్న ఆమె బుగ్గలే చెబుతున్నాయి.

రామారావుని చూస్తే కొంచెం సీరియస్‌గా వున్నాడనిపించింది. వెంటనే కావాల్సిన టెస్ట్‌లు చేశాను. అతని మెదడులో నాలుగోవంతు భాగం అంతా గడ్డ వుంది. అతని ఫిట్‌కి కారణం అదే. దాన్ని వెంటనే ఆపరేషన్ చేసి తీసేయాలి. ఆ తీసిన భాగంలో కొంత పెథాలజీ లాబ్‌కి పంపితే అది కేన్సరా మామూలు ట్యూమరా తేలుతుంది.

అతని తండ్రినీ, మామగారినీ కూర్చోబెట్టి అదే సంగతి చెప్పాను.

వారి మొహాలు మాడిపోయాయి. శుభమా అని పెళ్ళి జరిగాక ఇదేమి ఘోరం అని వాపోయారు. వాళ్ళ కేమిటి నాకే పాపం అనిపించింది.

అనవసరంగా బాధ పడవద్దనీ, కేన్సర్ అవడం అనేది కేవలం అనుమానమనీ, అతను త్వరలోనే కోలుకొని మామూలుగా వుంటాడనీ వారికి నచ్చచెప్పి ధైర్యం చెప్పాను.

అది కేన్సర్ అవకూడదని భగవంతుడ్ని ప్రార్థిస్తూనే ఆపరేషన్ చేశాను. తరువాత ట్యూమర్ సాంపిల్‌ని టెస్ట్ కోసం పంపాను.

ఆ రోజునుండీ ఓసారి ఆ జంట వైపు చూడటం పరిపాటి అయింది.

ఇన్నేళ్ళ నా సర్వీసులో సీరియస్ కేసులు రాలేదని కాదు, మరణాలని నేను చూడలేదని కాదు. ఎంతో మంది ఆడవాళ్ళ పసుపు కుంకుమలని ఈ రోగాలు మింగేయడం చూడకా కాదు.

కానీ అలాటివి చూసిన ప్రతీసారీ అన్యాయం పాలైపోయే స్త్రీల చుట్టూరానే నా ఆలోచనలు తిరుగుతాయి.

ఈసారి ఈ సీతని చూస్తుంటే ఆ ఆలోచనలు ఎన్నడూ లేనంత తీవ్రంగా నా మెదడుని కొరికేస్తున్నాయి.

వారిద్దరి జంట నిజానికి చూడ ముచ్చటగా వుంది. ఆ అమ్మాయి అతనికి ఇరవై నాలుగు గంటలూ చేస్తున్న సపర్యలు చూస్తే పదిహేను రోజులలోనే వారి మధ్య ఏర్పడిన అనుబంధం తెలుస్తుంది.

కొత్త దంపతులు, ఎన్ని కలలు కంటారు ఎన్ని మధుర క్షణాల్ని చవి చూస్తారు, ఎంత ఘాటుగా ఒకరి నొకరు ప్రేమించుకుంటారో తెలియని వాడిని కాదు.

వారిద్దరూ కళ్ళలో కళ్ళు పెట్టి చూసుకుంటూ మాట్లాడుతోంటే ఇక ముందు కూడా రామారావు పూర్తిగా కోలుకొని వారిద్దరూ అలగే జీవితాన్ని అనుభవించాలని మనసారా కోరుకున్నాను.

అయినా ఆమె పేరు సీత. సీత పేరు పెట్టుకున్న వారు కష్టాలకు గురి అవుతారని విన్నాను, కన్నాను.

ఒకవేళ అతని ట్యూమర్ బయాప్సీ కేన్సర్ అని తేలుతే ఆ అమ్మాయి భవిష్యత్తు ఏమవాలి!

ఒంటరిగా ఆమె మిగిలిన జీవితాన్ని గడపాల్సిందేనా! పూర్తిగా జీవితాన్ని అనుభవించ కుండానే జీవితపు ఆఖరి దశకు ఆమె చేరి పోవాల్సిందేనా! అలాటి వారిని ఆదుకునే వారెవరూ లేరా!

స్త్రీ అభ్యుదయం గురించి ఎన్నో మంచి మంచి అభిప్రాయాలు నాలోనూ వున్నాయి. పిన్న వయసులోనే బ్రతుకులు అన్యాయమై పోయిన స్త్రీలను ఉద్ధరించడానికి యువత ముందుకు రావాలి. ఈ సమాజపు తీరుల్లో రీతుల్లో మార్పు రావాలి. స్త్రీ పునర్వివాహాన్ని ఈ సమాజం సమర్థించాలి.

...ఛీ ...ఛీ ఇదేమిటి మరీ ఇలా ఆలోచిస్తున్నాను. సీత విధవరాలు ఎందుకు అవుతుంది. ఆపరేషన్ సక్సెస్ అయింది. అతను శుభ్రంగా మాట్లాడుతున్నాడు. వాళ్ళు కళ కళ లాడుతూ ఇక్కడి నుంచి వెళ్ళాలి. నన్ను నేను బాగా తిట్టుకున్నాను.

కానీ అప్పుడే వచ్చిన రామారావు రిపోర్టుని కవరులోంచి తీస్తుంటే నా చేతులు బాగా వణికాయి.

కాగితాన్ని బయటికి తీసి చూశాక మా అసిస్టెంట్ నన్ను కుదుపుతే తప్ప నేనీ లోకంలోకి రాలేదు.

రామారావుకి కేన్సర్.

అయోమయంగా వుంది.

భగవంతుడు ఎంత క్రూరుడు. రామారావు సీతలు ఏం పాపం చేశారని వాళ్ళ మీద కక్ష తీర్చుకుంటున్నాడు!

రామారావు తాలూకు వాళ్ళు వచ్చేశారు రిపోర్టు గురించి తెలుసుకోడానికి.

**స్త్రీ అభ్యుదయం గురించి ఎన్నో మంచి మంచి అభిప్రాయాలు నాలోనూ వున్నాయి. పిన్న వయసులోనే బ్రతుకులు అన్యాయమైపోయిన స్త్రీలని వుద్ధరించడానికి యువత ముందుకి రావాలి. మార్పు రావాలి.......**